# శృతి చేసిన వీణ

-సత్యవాడ సోదరీమణులు

"మరీ ఆ గుడ్డిదానికెంత పొగరు. ఇలా అడగడానికి దానికి నోరెలా వచ్చింది. అంటే దాని ఉద్దేశ్యం? పిల్లాడు మన కళ్లెదురుగా లేనంత మాత్రాన వేరే రాష్ట్రంలో ఉద్యోగం చేస్తున్నంత మాత్రాన మన సుధీర్..." ఆపుకోలేని ఆవేశంతో గట్టిగా అరిచేస్తున్న భార్యను వారించాడు సుబ్బారావు.

"పద వెళ్లిపోదాం. సుధీర్ ఇంకా ఆలోచిస్తావేం... నువ్వు కూడా నడూ" అంటూ వీధివైపు దారి తీసాడు.

విసురుగా భర్త వెంట వెళ్తున్నా ఆమె నోటికైతే తాళం పడలేదు.

"తండ్రిలేని పిల్ల, మన సుధీర్ ఇష్టపడుతున్నాడుకదా పోనీ పాపం అని ఈ ఇంట గడప తొక్కాంగానీ మావాడికేం? వందలకొద్దీ వస్తున్నాయి సంబంధాలు? దీని కూతుర్ని ఎవడు చేసుకుంటాడో చూద్దాం" చుట్టుపక్కలవాళ్లకు వినబడాలనే గొంతు చించుకుంటోంది.

పెళ్లికొడుకులంటే 'డూ...డూ...బసవన్నలే' అన్నట్లు తల వంచుకుని తల్లిదండ్రులను అనుసరించాడు సుధీర్. ఆ నిముషంవరకూ సందడిగా సరదాగా ఉన్న ఆ ఇంటి వాతావరణం ఒక్కసారిగా గంభీరంగా మారిపోయింది.

పెళ్లిచూపుల తతంగంలో సాయపడదామని రాత్రి నుంచి తోడుగావున్న తోటి లెక్చరర్స్ ఇద్దరు "తొందరపడ్డావు సుకన్యా... మరీ అంత చొరవ చేసి అలా మాట్లాడకపోవలసింది" అంటూ మందలించారు.

నేను పడ్డ అవస్థలు తెలిసికూడా నన్నే తప్పు పడుతున్నారు వీళ్లు. ధైర్యంచేసి ఆ విషయం మాట్లాడింది అంతే. అది తన పొరపాటెలా అవుతుంది? ఈ సమయంలో ఇలాంటి తెగువ లేకపోతే తనకి పట్టిన దుర్గతే తన కూతురికీ పడితే? నిట్టూర్చింది సుకన్య.

చిన్నబోయి కూర్చున్న శృతిని దగ్గరకు తీసుకుని "నువ్వేం మనసు పాడు చేసుకోకు. మీ అమ్మ ఇలా ప్రవర్తిస్తుందని మేమూ అనుకోలేదమ్మా. ఏం జరిగినా మన మంచికే అనుకోవాలంతే" అంది తెలుగు లెక్చరర్ సకల.

"అయిందేదో అయింది. నువ్వు ఆడపిల్ల తల్లివి అన్న విషయం మర్చిపోకే బాబు. మరో సంబంధం కలిసొచ్చినప్పుడైనా జాగ్రత్తే సుకన్యా..." సైన్స్ లెక్చరర్ శర్వాణి సుకన్య నెత్తిపై మొట్టికాయ వేసింది.

"మేమున్నాంగా. మరోసారి ఇలా జరగనిస్తామా? మీ అమ్మతో ఏ గొడవా పడకమ్మా శృతి. నీకేం బంగారుబొమ్మలా వుంటావు. చదువుల సరస్వతివి. ఏరికోరి ఎవరైనా నిన్ను చేసుకుంటారు. ఈ సంఘటనను నీ మనసులోంచి చెరిపేయ్" శృతి బుగ్గలు పుణికి ముద్దాడి వెళ్లిపోయారిద్దరూ.

★★★

భడాలున తలుపేసి తల్లిమీద విరుచుకుపడింది శృతి.

"నీ తెలివితేటలన్నీ నా జీవితం మీద బాగా ప్రయోగిస్తున్నావమ్మా. వాళ్లని రప్పించి ఇలా అవమానించేకన్నా నిన్ను కనీ పెంచీ విద్యాబుద్ధులు చెప్పిస్తున్నది అందరి తల్లుల్లాగా అత్తారింటికి పంపడానికి కాదు. రేపు నువ్వు ఇంజనీరువై రెండుచేతులా సంపాదించి పోస్తే నేనూ సుఖపడాలి అని సూటిగా చెప్పేస్తే పోయేదిగా. సుధీర్ గురించి నీతో చెప్పినప్పుడే నాతో ఎందుకనలేదు. అంటే ఎప్పుడూ అతను నా ముఖం చూడకుండా దెబ్బకొట్టడం అన్నమాట" నిష్ఠూరంగా అంది.

కూతుర్ని ఎలా సమాధానపరచాలో అంతుపట్టని ఆ పిచ్చితల్లి చీకటి కళ్లు ధారాపాతంగా వర్షిస్తున్నాయి.

"ఆహా... ఎంత బాగా నటిస్తున్నావు. ఈ ఏడుపు సీన్ బావుంది. నీ కన్నీళ్లకి నేను కరిగిపోయి... పోనీలేమ్మా... నీ షరతుకి అంగీకరించిన వాడే నన్ను పెళ్లాడతాడు. ఒకవేళ పెళ్లి కాకపోయినా చల్లని తల్లివి నువ్వున్నావు. నాకే చింతా లేదు అంటూ నిన్ను సమర్థించాలి కదూ. సరే అలాగే చేద్దాంలే. ఒక్క రెండేళ్లు ఓపికపట్టు. నా ఆర్జన మొదలవుతుంది. నీ ఉద్యోగానికి రాజీనామా చేసేసి ఇంటి పట్టున ఉండొచ్చు. వేదికలెక్కి ఉపన్యాసాలు, వీణ కచేరిలు చేస్తూ పేరు ప్రఖ్యాతులే గడించుకుందువుగానిలే" ఉక్రోషంగా ఇంకా ఏవేవో అంటూ తన గదిలోకి వెళ్లి మంచమ్మీద వాలిపోయింది.

'తల్లి మనసు వెన్న-బిడ్డ మనసు రాయి' అన్న సామెతలా సుకన్యకి కూతురిపై కోపం రానే లేదు. పసిపిల్ల ఎన్ని కలలు కన్నదో... ఆ కుర్రాడ్ని ఎంతగా ప్రేమించిందో. ఆ పాల మనసు ఎంతో కలతపడితే తప్ప ఇలా నిందించదు. దానికి తల్లయినా తండ్రైనా తనే కదా.దాని క్షేమం కోరే తనిలా చేయక తప్పలేదని ఆ బేల మనసుకి అర్థంకావాలి. అదెలా సంభవం...' తల పట్టుకుంది.

లోపల్నుంచి శృతి వెక్కిళ్లు విన్పిస్తున్నాయి. ఇక లాభంలేదు. తన జీవితపు లోతులు శృతికి తెలియకపోతే తామిద్దరి మధ్యా నిలిచిన ఈ ఇనుపతెర తొలగిపోదు. గభాలున లేచి శృతి దగ్గరకు వెళ్లింది సుకన్య.

మంచంపైన కూర్చుని మంచమంతా చేతులతో తడిమి వారగా పడుకున్న కూతుర్ని బుజ్జ


గించబోయింది.

"ప్లీజ్... నన్ను వంటరిగా వదిలేయ్. చెప్పు న్నాగా... నా సంపాదనలో నిన్ను సుఖపెడతానని. కాళ్లు కందకుండా నిన్ను చూసుకుంటాలే. నాలో నేను ఎంత కుమిలిపోతున్నా నీకే లోటు రాని వ్వను ఇకవెళ్లు."

కూతుర్ని ప్రవర్తనలోని తిరస్కారాన్నీ, తృణీకారాన్ని తట్టుకోలేకపోయింది.

"నువ్వెంత వెటకరించినా, ఎన్ని వ్యంగ్య బాణాలు నాపై విసిరినా ఫర్వాలేదు. నేను కోరుకునేది ఒక్కటే. నా ఒక్కగానొక్క బిడ్డ, నా ఇంటి జ్యోతి, నా కంటిపాప కళకళలాడుతూ కాపురం చేయాలి."

"అమ్మో... దయచేసి ఇంక ఆపుతావా... మీ వికలాంగుల సంగతి ఎవరికి తెలియదని? ఏరు దాటగానే తెప్ప తగలేస్తారు. కన్నపిల్లల బాగోగులైనా మీలాంటివాళ్లకి పట్టవు. మామీద ఆధారపడి బ్రతుకుతూ కూడా కుటుంబంలో, సమాజంలో మీరే సుస్థిర స్థానం సంపాదించుకోవాలని చూస్తారు. చివరివరకూ మీ అభ్యుదయం, ఆనందం ముందు మా జీవన విలువలు కూడా దిగదుడుపే. అదే జరుగుతోంది నా విషయంలో. గమ్యం చేరాక చిటికలో పట్టుకున్న చేతిని వదిలేస్తారు. ఊహ తెలిసినప్పటినుంచీ చూస్తున్నా... నీ



వెంట ఆ బ్లైండ్ స్కూళ్ళకి, మీటింగ్‌లకు, గుడ్డివాళ్ళతో, మూగా చెవిటివాళ్ళతో మీకు కన్ను, కాళ్లు చెవులు అవుతూ సహాయపడ్డాను. ఇంత సులభంగా నన్నెలా వదలుకుంటావు. భర్త చేతిలో పెట్టి అందరి తల్లుల్లా నువ్వూ సంతోషపడతావని ఆశించడం నాదే తెలివితక్కువ. అర్థమైందిప్పుడు. ఇక నుంచి నీ బ్రతుకు పండించడానికే నా జీవితాన్ని ఫణంగా పెట్టేస్తాను.''

శృతి అలా మాట్లాడుతుందని ఏమాత్రం తన ఊహకి అందినా పరిస్థితి ఇంతదాకా రానివ్వకపోయేది. ఇప్పుడు తమిద్దరి మధ్యా అగాథం పెరిగిపోతోంది.

ఎటూ పాలుపోని సుకన్య అచేతనంగా ఉండిపోయింది. ఆ మౌనంలో, ఆ శూన్యంలో రెండు హృదయాలు. తల్లినే అమితంగా ప్రేమించే ఆ చిన్నారి అకస్మాత్తుగా తల్లే తనకి ఎదురు దెబ్బ కొట్టిందే అన్న భావనలో విలవిల్లాడిపోయింది.

## సమపాళ్లల్లో ఆహారం

ఎదుగుతున్న పిల్లలకు రోజూ బ్రెడ్, అన్నం, ఇతర తృణధాన్యాలు, ఇడ్లీ, దోశ, చపాతీ...వీటిల్లో ఏదో ఒకటి రోజూ ఆహారంలో తప్పనిసరిగా ఉండాలి. మాంసకృతులు ఎదిగే పిల్లలకు చాలా అవసరం. మాంసం, చేపలు, గుడ్లు, పప్పు ధాన్యాలు, పన్నీర్ ఇతర ప్రత్యామ్నాయాల్లో ఏవైనా సరే తరచూ పెట్టడం మంచిది. చిన్నపిల్లలకు కేవలం పాలు ఒక్కటే కాదు, పెరుగు, పన్నీర్ వంటి ఇతర పాల ఉత్పత్తులు ఇవ్వడంవల్ల కాల్షియం అందుతుంది. పిల్లలకు అన్నిరకాల పోషకాలు అందాలంటే రోజూ తాజా పండ్లు, కూరగాయలు తప్పనిసరి. అరటిపండ్లు, ఆపిల్, క్యారెట్ , స్వీట్, కార్న్, బీన్స్, బఠాణీ, టమాటాలు... ఇలా పలు వెరైటీ పండ్లు, కూరగాయలు, పండ్లరసాలు నిత్యం పిల్లల డైట్‌లో తప్పనిసరి. పిల్లలు తీపి పదార్థాలనే ఎక్కువగా ఇష్టపడతారు. కానీ వీటివల్ల దంత సంబంధ సమస్యలు వచ్చే ఆస్కారం ఉంటుంది. అంతేకాదు, కొవ్వు పదార్థాలు, ఉప్పుశాతం ఎక్కువగా ఉండే స్నాక్స్‌ను తగ్గించాలి. పానీయాలు, జ్యూస్‌లు సులువుగా తాగుతారని చాలామంది ఎప్పుడుపడితే అప్పుడు పిల్లలకు ఇస్తుంటారు. అవి భోజనం తరువాత ఇచ్చేలా చూసుకోవాలి. లేదంటే భోజనానికి గంట ముందు ఇవ్వడం మంచిది. అప్పుడే చక్కని ఫలితం పొందగలుగుతారు.

-కాలిపు శంకరరావు



తనకి సర్వస్వం అయిన శృతి అపార్థం చేసుకుని అసహ్యించుకుంటోంది తనని.

తన బిడ్డ ఎలా అయినా యదార్థాన్ని గ్రహించాలి. అమ్మా అంటూ తనని హత్తుకుని ఎప్పటిలా తన ఒళ్లో గారాలు పోవాలి. అందుకోసం తనేం చేయాలి?

తీవ్రమైన ఆవేదన సుకన్యని పట్టి కుదిపేస్తున్నాయి. ఎంత అనుభవం ఉండి తన ఆలోచనను తప్పుదారి పట్టించింది. శృతితో ఒక్కమాట అనేసి ఉన్నా లేదా సకల, శర్వాణీలతో నా పాపకి నా జీవిత కథ వివరంగా చెప్పండి అని అన్నా ఇంత జరిగేది కాదేమో.

ఒంటరిగా నిర్ణయాలు తీసుకోకూడదని పెద్దలు ఊరికే అనరు. యాంత్రికంగానే వంట చేసింది. పళ్లెంలో అన్నం కూర పెట్టి పెరుగు గిన్నెతో సహా బెడ్రూంలోకి వచ్చేసింది.

"తల్లీ శృతీ! భోజనం చేద్దామా?'' జాలిగా పలికింది సుకన్య కంఠం.

ప్రతిరోజూ ఒకే పళ్లెంలో భోజనం చేస్తారిద్దరూ. తల్లి అన్నం కలిపి పెడితేగానీ తిన్నట్టుండదు శృతికి. అంత పెద్ద భవంతిలో ఆ ఇద్దరే వుంటారు. అందరికీ విచిత్రంగా తోచే అనుబంధం పెనవేసుకున్న ఆ రెండు మనసులూ ఈరోజు విడివిడి అయిపోయాయి. ఎవరికి వారే అన్నట్లు భోజనం ముగించారు.

తల్లి నేలపై చాప పరచుకుని పడుకున్నా శృతి ఏమీ అనలేదు. ఇరవై ఏళ్లు దాటినా కూడా ఒకే మంచంపై తల్లి కౌగిట్లోనే ఒదిగిగానీ నిద్రపోని శృతి ఇకనుంచి ఏకాకిగానే ఉండడం అలవాటు చేసుకోదలచుకుంది. గాఢంగా అల్లుకుపోయిన బంధాలు క్షణాల్లో తెంచేసుకోడం అసాధ్యం అన్నట్లు కలత నిద్రలో 'అమ్మా'' అంటూ కెవ్వున కేక పెట్టింది శృతి.

నిద్రే కరువైన ఆ కళ్లు లేని కబోది "నా తల్లీ శృతీ.. ఏమైందమ్మా'' అంటూ మంచంపైకి ఉరికి శృతిని కౌగిట్లోకి తీసుకుంది.

"అమ్మా.. రేపే నేను హాస్టల్‌కి వెళ్లిపోతాను. ఇక నీ నీడ కూడా నామీద పడడానికి అంగీకరించను. నీ పన్నాగం బయటపడినా నీ చేతుల్లో పసిపాపనే అయిపోతున్నాను. ఈ జీవితం గడపలేను'' అంది శృతి.

"సరేలే...వెళుదువుగానీ. ఈ అమ్మ అంతర్మథనం తెలుసుకుని నీ ఇష్టం వచ్చినట్లే జీవించు. నేను కాదనను'' వళ్లంతా నిమురుతూ అంటున్న అమ్మ మాటల్ని తోసిపుచ్చలేకపోయింది శృతి.

"అప్పుడు సరిగ్గా నేను నీ వయసులో ఉన్నాను. టీచర్ ట్రైనింగ్ పూర్తి చేసి ఉద్యోగంలో చేరిన తొలిరోజుల్లో పిల్లలకు పాఠాలు చెప్పడం, వీణ సాధన చేయడంతప్ప కన్నెపిల్లలందరిలా వైవాహిక జీవితం గురించిన తలపులకు తావిచ్చేదాన్నికాదు. అయితే ఇంట్లో ఎప్పుడూ ఆ ప్రస్తావనలే. 'చూపు లేకపోతేనేం? చదువుకుని సంపాదిస్తోంది. చక్కని చుక్క. మనం ప్రయత్నమంటూ చేస్తే ఏ కుర్రాడో ముందుకు రాకపోడు' అనుకుంటూ ఉండేవారు. అవేమీ నా మనసుకి తాకేవి కావు. అన్నీ సక్రమంగా ఉన్నవాళ్లే భర్తల చేతుల్లో ఎన్నో కష్టాలు పడుతున్నప్పుడు నాకెందుకీ లేనిపోని ఆశలు అనుకునేదాన్ని. అలాగే మీ పిన్ని, మామయ్య, అమ్మమ్మ, తాతయ్యలతో వాదించేదాన్ని.

"హాయిగా వీణపై మధురరాగాలు పలికించుకుంటూ మైమరచిపోతాను. నా వృత్తిధర్మం నిర్వర్తించుకుంటూ ఆ పసిపిల్లలతోనే పరవశించిపోతాను. ఇంతకుమించి ఏ కోరికలు లేవు నాకు'' అని ఖచ్చితంగా చెప్పేదాన్ని. వాళ్ల పంతమే నెగ్గించుకుని నన్ను పెళ్లిచూపుల్లో కూర్చోబెట్టారు. నాలో అంతవరకూ వున్న స్థిరనిర్ణయం, బిగువు, బింకం అన్నీ ఎక్కడికి పోయాయో నాకే తెలియదు. మీ నాన్న నన్ను ఇష్టపడ్డారని తెలియగానే నాలో తీయని అనుభూతులేవో చిగురు తొడిగాయి.

అమ్మానాన్నల ఆనందానికి అంతేలేదు. నా పెళ్లి ఘనంగా చేసి మురిసిపోయారు. ప్రతి ఆడపిల్ల జీవితంలో మరపురాని మధురిమ తొలిరాత్రి నా జీవితంలోకూడా అడుగుపెట్టింది. అమ్మలక్కలంతా హాస్యాలతో, చతురోక్తులతో నన్ను ఆట పట్టిస్తూ గదిలోకి తోసి తలుపులు మూసారు. ఆ క్షణం భయంతో, బిడియంతో, దాచినా దాగని సంతోషంతో ఉక్కిరిబిక్కిరయ్యాను. తనువంతా కంపిస్తుంటే చేతిలో పాలగ్లాసుతో బరువుగా నాలుగు అడుగులు వేసాను.

అతను నన్ను రెప్పార్పకుండా చూస్తున్నాడా? చిరునవ్వులు చిందిస్తూ పలుకరిస్తున్నాడా? ఊహూ... చప్పున చేయి అందుకుంటాడు. అమాంతం దగ్గరకు తీసుకుని ఆపై ఊపిరాడనీయడు.

నిముషాలు దొర్లిపోతున్నాయి. అతని స్పర్శకోసం, లాలన కోసం మేను లొకటిగా అల్లుకుపోయే శుభ గడియ కోసం తపించుపోతుంటే ఆ నిముషాలే అతి భారంగా తోస్తున్నాయి. ఏమిటీయన కిమ్మనడు? మనస్సయితే ఎప్పుడే ఇచ్చేసాను.

కాకుంటే ఏరికోరి ఎందుకు చేసుకుంటాడు? ఆస్తిపరుడట, నీ మొగుడు అపర మన్మధుడే అంటున్నారంతా. సిగ్గుతెరలు కమ్మేస్తున్నా తనని చిలిపి కోరికలు నిలువనీయడంలేదు. మగాడే మరి అతనిలో ఆ తొందరేది? చివరికి "పాలు చల్లారిపోతున్నాయి" అనేసాను నేనే.

"రా... మంచంమీద నా పక్కన కూర్చో" తడబడుతూ అన్నాడు.

అబ్బా... ఎంత కమ్మని స్వరం అనుకుంటూ అతనికి అతి చేరువగా కూర్చున్నాను. నా చుట్టూ చేయివేసి పాలగ్లాసు అందుకున్నాడు.

"ఈ జీవితం నీతో పాలు పంచుకోవడానికి కొట్టుమిట్టాడుతోంది నా హృదయం"

"అంధురాల్ని అని తెలిసేగా చేసుకున్నారు?"

"ఛ...అది కాదు నేననేది."

"అయితే నా దగ్గరేదో మీరు దాస్తున్నారన్నమాట. ప్లీజ్... అలా ఎప్పటికీ చేయకండి. నేను మీ అర్ధాంగిని. మిమ్మల్ని అర్థం చేసుకునే నడుచుకుంటాను. మీరు చెప్పే విషయం ఎలాంటిదైనా ఏమనుకోను. ఈ చీకటి జీవితానికి మీరు ప్రసాదించిన వెలుగు అసమాన్యమైనది. తాళి కట్టిన మిమ్మల్నే దైవ సమానంగా భావిస్తున్నాను."

"నువ్వు జ్ఞానదీపికవి సుకన్యా... నేనే చీకటిలో మగ్గిపోతున్నాను. ఆ చీకటి భూతం నిన్ను ఆవరించకూడదు."

ఆశ్చర్యపోవడం నా వంతయి "ఏమిటండీ?" అన్నాను.


మీ నాన్న చెప్పింది వినగానే నా వళ్లు గగుర్పొడిచింది. నాముఖ కవళికలు పసిగట్టారో ఏమో...

"నేనంటే అసహ్యం వేస్తోంది కదూ. అది సహజమేలే. నిజానికి నాకు వివాహం చేసుకునే అర్హతలేదు. ఓ ఇంట అపురూపంగా పెరుగుతున్న ఆడపిల్లను మోసపుచ్చి ఆత్మవంచన చేసుకోలేక శతవిధాలా మావాళ్లతో పోరాడాను కూడా. ఇంటిల్లిపాదీ ప్రాణాలు తీసుకుంటామని నా కళ్లముందే సాహసించడంతో ఈ పాపానికి ఒడిగట్టక తప్పలేదు" అంటూ దయనీయంగా చెప్పాడు.

ఆయనలోని స్వచ్ఛత, నిర్మలమైన అనురాగం నన్ను ఆకట్టుకున్నాయి.


"చేతి నిండా డబ్బు ఉండడం కూడా అనర్ధాలకు దారి తీస్తుంది. నాపట్ల అది నిజమైంది. తల్లిదండ్రుల క్షణం తీరికలేని జీవనాన్ని గడుపుతూ నన్ను హాస్టల్‌లో ఉంచడంతో అల్లరిచిల్లరిగా పెరిగాను. బెల్లం చుట్టూ ఈగల్లా తోటి కుర్రాళ్లంతా నా చుట్టూ మూగేవారు. వాళ్ల వ్యసనాలకు, చెడు అలవాట్లకు పెట్టుబడి నాదే. రోజుకో సరదా. మితిమీరిన విచ్చలవిడితనం నా జీవితాన్ని పతనం చేసాయి. స్త్రీలపట్ల ఆకర్షణ, ఆ అనుభవంలోని మత్తు గమ్మత్తు నన్నే స్థితికి దిగజార్చాయో ఎయిడ్స్ రోగినయ్యేదాకా తెలిసిరాలేదు నాకు. నువ్వు పసితనపు ఛాయలు వీడని పసిడిబొమ్మవి. నావల్ల నీకే విధమైన అన్యాయం జరగకూడదు. దయచేసి నీ భర్తగా నన్ను స్వీకరించవద్దు" జాలిగా మీ నాన్న అంటుంటే వినలేకపోయాను.

"మీ నిజాయితీకి మీలోని సంస్కారానికి చెయ్యెత్తి నమస్కరిస్తున్నాను. పశ్చాత్తాపంతో నన్ను తాకనైనా తాకలేదు మీరు. మీ మంచితనానికి ఇంతకన్నా నిదర్శనం ఏం కావాలి? దారుణమైన రోగం మిమ్మల్ని పట్టి పీడిస్తున్నా మలినం అంటని మనసు మీది. నా మనుగడ ప్రశాంతంగా, సంతోషంగా సాగిపోవడానికి ఆ వరం చాలు నాకు. మనం దాంపత్య సుఖానికి దూరమైనంత మాత్రాన భార్యాభర్తలం అన్న బంధాన్ని తెంపేసుకుంటామా? మీరే ఎప్పటికీ నా దైవం" అతని పాదాలపై పడ్డ నన్ను సుతిమెత్తగా లేవదీసి హృదయానికి హత్తుకున్న ఆ దివ్యక్షణాలు తొలి రాత్రి అనుభూతినే అందించాయి నాకు.



## సంబరపడుతున్న సమీరా

నగలకి మోడలింగ్ చేయడం బాలీవుడ్ తారలకి ఇప్పుడు కొత్త క్రేజ్ అయింది. ఐశ్వర్య, కత్రినాల తర్వాత సమీరా రెడ్డి కూడా ఓ నగలకి బ్రాండ్ అంబాసిడర్‌గా చేయడానికి సిద్ధమైంది. 'రివాజ్' అనే ఆ కంపెనీ ఆభరణాలకి మోడలింగ్ చేస్తున్న సమీరా రెడ్డి, ఇలాంటి యాడ్ చేస్తున్నందుకు తెగ సంబరపడిపోతోంది.




విస్మయంతో వింటున్న శృతి "ఈ రహస్యాన్ని ఇంతకాలం నా దగ్గర ఎందుకు దాచావమ్మా. ఊహ తెలియగానే నాతో చెప్పి వుంటే నీ బాధ నేనూ పంచుకుని ఉండేదాన్ని. అనరాని మాటలని దేవతలాంటి నిన్ను ఎంతో కష్టపెట్టాను. నన్ను క్షమించగలవా అమ్మా" ఏడుస్తూ అంది శృతి.

"ఇది నీ తప్పెలా అవుతుందమ్మా... ఆత్మీయుల మధ్య రహస్యాలు ఉండకూడదు. పొరపాటు నాదే.."


"అలా అంటే నేనొప్పుకోను. నేనే నీ సర్వస్వంగా జీవిస్తున్న నిన్ను తొందరపాటుతో అపార్థం చేసుకున్న మూర్ఖత్వం నాదే. నా వివేచనాజ్ఞానం ఏమైపోయిందో?" శృతి దుఃఖం కట్టలు తెంచుకుంది.

"ఊరుకో తల్లీ... చెప్తున్నాగా. ఇందులో నీ తప్పేంలేదు. మీ నాన్నకిచ్చిన మాట కోసం నేనిలా చేయవలసి వచ్చింది. నువ్వు పసిపాపగా చిందులు వేస్తూ వచ్చీరానీ మాటలతో మమ్మల్ని మురిపిస్తుంటే మైమరచిపోయే వారు. నువ్వు అల్లరిగా అలిగి దగ్గరకు రాకపోతే 'నేను నీ నాన్నను తల్లీ. నాకు



## మేడ్ ఫర్ ఈచ్ అదర్?

కరీనాకపూర్-సైఫ్ అలీ ఖాన్‌ల మధ్య బంధం తెగిపోయింది, పెళ్లీ లేదు గిల్లీలేదు అంటూ వార్తలు వినిపించినంత సేపు పట్టలేదు, మళ్లీ సైఫ్ భజన చేస్తోంది కరీనా. ఇటీవల ఓ బ్రిటన్ పత్రికిక్కిచ్చిన ఓ ఇంటర్వ్యూలో 'సైఫ్-నేనూ మేడ్ ఫర్ ఈచ్ అదర్ లాంటివాళ్లం. ఆయనతో ఎంత ఎక్కువ కాలం కలిసి వుండగలిగితే అంత బావుంటుందని నా అభిప్రాయం' అంటూ సెలవిచ్చింది కరీనా. అంటే దీని అర్థం ఏంటో? ఇద్దరూ ఎప్పటికైనా పెళ్లి చేసుకుంటారా? లేక ఇలాగే 'ఫ్రెండ్లీ'గా గడిపేస్తారా? ఏమో? కాలమే సమాధానం చెప్పాలి.




దూరమైపోతావా?' అంటూ బాధపడిపోయేవారు.

"ఏమిటా పిచ్చి...శృతి మీకెందుకు దూరమవుతుంది. ఎప్పటికీ మీ బిడ్డే" అనేదాన్ని. అయినా లేనిపోని సందేహాలేవో మనసులో పెట్టుకుని తెగ బాధ పడిపోయేవారు.

వాటన్నింటినీ తుడిచి పట్టేస్తూ మీ ఇద్దరికీ ఒకే పళ్లెంలో భోజనం, టిఫిన్ లాంటివి తినిపించేదాన్ని. అలాగే నీకూ అలవాటయింది. నాన్న కొసరి కొసరి గోరుముద్దలు తినిపించేవారు.నీ చిట్టి చేతులతోమీ నాన్న నోటికి నువ్వు అందించేదానివి. నీతో హోంవర్క్ చేయించి ముద్దుముద్దుగా నువ్వు తెలుగు పద్యాలు చదువుతుంటే ఆనందించేవారు.

తరచూ ఎన్నో రాత్రులు ఆయన పాలిట కాళరాత్రులే. ఏ అర్ధరాత్రో నాకు మెలకువ వస్తే మంచంపై మనిద్దరమే. ఇల్లంతా వెదికి పట్టుకునేదాన్ని. వీధి వరండాలోనో, హాలులోనో, ఆఖరికి వంట గదిలోనో వంటరిగా తన దుఃఖం తీర్చుకుంటూ ఉండేవారు. నన్ను చూడడంతోనే భోరున ఏడ్చే వారు.

"నేను మీవాడ్నికాదు. అర్ధాయుష్షుతో పోయే నాలాంటి వాడికి ఈ బంధాలేమిటి? నన్ను వేరుగా చూడండి. మీరిద్దరూ సుఖంగా ఉండాలంటే నామీద ఏమాత్రం మమకారం పెంచుకోకూడదు మీరు"

ఆయన దుఃఖం తీర్చడం సాధ్యపడేదికాదు.

"మీరు ఏమైపోయినా శృతి మనసులో మంచి తండ్రిగా, ఆదర్శమూర్తిగా నిలిచిపోతారు. మాట ఇస్తున్నాను సరేనా" అన్నాను.

'నాకా వరం చాలు సుకన్యా. ఈ జీవితం నుండి ఆనందంగా నిష్క్రమిస్తాను. నేను వ్యసనపరుడిని, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుడినని తెలిస్తే నా బిడ్డ నన్నెంత అసహ్యించుకుంటుంది. ఆ ఆలోచన నాలో తలెత్తినప్పుడల్లా నా మనసు ముక్కలవుతుంది.'

'ఎప్పుడూ మీ మనసును అలా వికలం చేసుకోకండి. అనాలోచితంగా అజ్ఞానంలో చేసిన పొరపాటుకు ఇంతగా కుమిలిపోతారెందుకు? బ్రతికినంతకాలం సుఖసంతోషాలను అనుభవించండి. మనది పచ్చని కాపురమే. మనకో చక్కని చిన్నారి ఉంది' అంటూ ఇలా నచ్చచెప్పేదాన్ని. నా శక్తివంచన లేకుండా చేయగలిగిన సేవలన్నీ చేసేదానిని. ఆయన తరచూ జ్వరం, వాంతులతో బాధపడేవారు.

"నాకోసం ఇంత చేస్తున్నావు. నీ బంధువులందరి దృష్టిలో నేను మామూలు మనిషినే. నీకోసం నేనే ఏదో త్యాగం చేసినట్లు భావిస్తున్నారు వాళ్లంతా. నీ సహనం, ఓర్పు వెలకట్టలేనివి. నీకు నేను ఏమివ్వగలను. నా నుండి నీకొచ్చే ఆస్తి ఏమూలకు" ఎప్పుడూ మీ నాన్న నోట అవే మాటలు.

మానసికంగా అయితే ధైర్యస్థైర్యాలను ఇవ్వగలిగానుగానీ శుష్కించిన ఆ శరీరం నాకు తోడుగా ఎన్నాళ్లు ఉండగలదు. నీకు పదేళ్లు నిండేదాకా ఆయన్ని దక్కించుకోగలిగాను.

అంధురాలినైనా నా పెళ్లి ఎంత వైభవంగా చేసారో, నేను భర్తని కోల్పోయి వైధవ్యాన్ని అనుభవించవలసి వచ్చినప్పుడు మీ మామయ్య, అమ్మమ్మ అంతగానూ ఆవేదన పడ్డారు.

ఏదో జబ్బుని ఓ రెండేళ్లు అనుకున్నారేతప్ప అసలు విషయం నేను అణుమాత్రం కూడా తెలియనివ్వలేదు. కనుకనే అందరూ మనల్ని ఆదరించడానికి సిద్ధపడ్డారు. మీ నాన్న జ్ఞాపకాలతో ఓ సంవత్సరం పిచ్చిదానిలా బ్రతికాను. మీ పిన్ని నన్నెంతో ఓదార్చింది. నిజం చెప్పాలంటే నువ్వెంతో అదృష్టవంతురాలివి.

కళ్లు లేని నేను పెళ్లిచేసుకుని ఏం సుఖపడతానని వాదించే నిన్ను బావగారు కళ్లల్లో పెట్టుకుని చూసుకున్నారు. నీ పేరిట బ్యాంక్ బ్యాలెన్స్, పొలం, ఇల్లుఅన్నీ ఉన్నాయి. పెరుగుతున్న నీ కూతురే ఎప్పటికీ నీకు

తోడు. అపురూపమైన మీ ఆయన ఈ చిట్టి తల్లితోనే ఉన్నారనుకో'' అంటూ నన్నీ లోకంలోకి లాక్కొచ్చింది.

తల్లి చెప్పేది వింటూనే శృతి ఏటో ఆలోచిస్తోంది. తన తల్లిదండ్రుల మధ్య మానసిక బంధమే తప్ప మరేంలేదు.

పతివ్రత అయిన తన తల్లి బంధుకోటికి ఈ విషయం తెలియనివ్వనే లేదు.

అలాంటప్పుడు తను వీళ్ల బిడ్డ కావడమేమిటి? అప్రయత్నంగానే అడిగేసింది అమ్మని.

"అక్కడికే వస్తున్నానమ్మా. నాలోనే లోపం వుందని, నేను తల్లిని కాలేనని డాక్టర్ సర్టిఫికెట్ పుట్టించి అందర్నీ నమ్మించాను. పురిటికందువైన నిన్ను అనాథాశ్రమం నుండి తెచ్చుకుని మా జీవన శృతివి నీవని బంధువులందరితోనూ కలసి ఘనంగా నీ బారసాల చేసి నీకా పేరు పెట్టాం'' శృతికి సందేహ నివృత్తి చేసింది.

"యూ ఆర్ గ్రేట్ మమ్మీ... రియల్లీ గ్రేట్'' తల్లిని పెనవేసుకుని ముద్దుల వర్షం కురిపించింది.

"నాలో ఏముందమ్మా. గ్రేట్‌నెస్ ఏదైనా ఉందంటే అది ఆయనదే. ఒక్కోసారి ఏమనేవారో తెలుసా? 'నన్ను మంచి మిత్రుడుగా భావించు. నీ బాధ్యత నాదిగా విషయమంతా సహృదయుడు ఎవరికైనా చెప్పి యోగ్యుడైన ఓ అబ్బాయితో నీకు వివాహం జరిపిస్తాను.''

ఆ మాటలు నేను భరించలేకపోయేదాన్ని.

"మనం ఆలూమగలం మాత్రమే కాదు, అమ్మానాన్నలం కూడా'' అంటూ నిన్ను పెంపకానికి తెచ్చి మావారి నోటికి తాళం వేసాను. అప్పటికీ అహర్నిశలూ నా గురించే ఆలోచిస్తూ ఉండేవారు. అంధురాలివని సమాజం నిన్ను చిన్నచూపు చూస్తుంది. నువ్వొక ఎయిడ్స్ రోగి భార్యవన్న ముద్ర పడితే ఇంకెంత తేలిగ్గా చూస్తారు అని ఎంతగానో బాధపడేవారు. మూర్తీభవించిన మంచితనం మీ నాన్నలో చూసానమ్మా'' సుకన్య కళ్లు వర్షించాయి.

"మీది అరుదైన దాంపత్యమమ్మా'' తల్లి కళ్లు తుడిచింది.

కూతురిలో తన గాథ చెప్పుకున్న సుకన్య హృదయభారం దిగినట్టు తేలిగ్గా ఊపిరి పీల్చుకుంది.

ఒక్క పూటలో ప్రేమమూర్తి అయిన తన తల్లి గురించి ఎంత నీచంగా ఊహించుకుంది.

క్షణాల్లో తన మనసులో ఎంత కల్మషం పేరుకుపోయింది? తన తొందరపాటు తెలుసుకుని పావ ప్రక్షాళన చేసుకున్న శృతి మనసు నిర్మలంగా ఉంది.

***

"ఎవరదీ?''

ఆ అడుగులు సుధీర్‌వి కదూ... బాత్రూంలో స్నానం చేస్తున్న కూతురి వీపు తోముతున్న సుకన్య సబ్బు శృతి చేతికిచ్చి చేతులు కడిగేసుకుని బయటకొచ్చింది.

"ష్... ఏంటి మమ్మీ... నువ్వే కూరలు వాడితో గొడవపడి వీధి తలుపు వేయడం మరచిపోయి వచ్చేసావు. బాత్రూం తలుపైనా చారవేయలేదు'' సిగ్గుతో ముడుచుకుపోతూ గడియ బిగించుకుంది.

"చడీ చప్పుడు చేయకుండా సరాసరి లోపలకు వచ్చేస్తావా?''

"అమ్మో... అత్తగారూ... నా అడుగులు ఎలా పసికట్టగలిగారు?'' ఒక్క అంగలో హాలులోకొచ్చి సోఫాలో కూర్చున్నాడు.

"జీవితాలు సజావుగా సాగాలంటే మాలాంటివాళ్లం ఎన్నో గుర్తించాలి బాబూ. ఈ అతి జాగ్రత్తతోనే మీ అందరి మనసులూ కష్టపెట్టాను'' అంది బాధగా.

"కష్టపెట్టలేదు అత్తయ్యా... కర్తవ్యం నిర్దేశించారు. మావాళ్లందరితో అలాగే వాదులాడి నా దారికి తెచ్చాను కూడా. యువతరానికి మీ సూచన ఆచరణీయం. నేనూ శృతి ఇదే విషయంలో సమాజానికి మావంతు తోడ్పాటునందిస్తాం. ఇదిగో తీసుకోండి నా హెల్త్‌కార్డ్'' కవిత్వ ధోరణిలో అంటూ తన హెల్త్ చెకప్ రిపోర్టు సుకన్య చేతుల్లో వుంచాడు.

తలారా స్నానం చేసి అందమైన చీరలో ప్రత్యక్షమైన శృతి అప్సర కాంతలా అనిపించింది.

కొంటెగా ఆమె చేయి అందుకుని పెదవులకానించుకున్నాడు. తన ప్రేమ ఫలవంతమైనందుకు మురిసిపోయింది శృతి.

☆

## బెండ పుట్టుపూర్వోత్తరాలు

బెండకాయను క్రీస్తుపూర్వం 1200లోనే ఇప్పటి ఇథియోఫియా ప్రాంతంలో పండించేవారని చెబుతారు. అక్కడినుంచి ఉత్తర ఆఫ్రికా మధ్యధరా ప్రాంతం, అరేబియా నుంచి మన దేశానికి చేరుకుంది. ఆఫ్రికా నుంచి వెళ్లిన బానిసలవల్లే అమెరికా వాళ్లకు పరిచయమయ్యాయి. ఉత్తర భారతదేశంలో భిండి అనీ, దక్షిణ భారతంలో బెండకాయ, వెండకాయ అని పిలుచుకుంటారు. మలేసియాలో బెండీ, క్యూబాలో ఓక్రో, ఒకోరో, క్వింగాంబో అని పేర్లు. దక్షిణ ఆసియా ప్రాంతంలో లేడీస్ ఫింగర్, కోపి అరబ్, కకంగ్, బెండి, ఆఫ్రికాలో గోంబో, జపాన్‌లో ఒకుర అని పిలుస్తారు. ఆఫ్రికా నుంచి అమెరికాకు వచ్చిన బానిసలు బెండకాయ గింజలను పొడి చేసి తినేవారు. అమెరికా సివిల్ వార్ సమయంలో బెండకాయ గింజల పొడిని కాఫీకి బదులుగా ఉపయోగించేవారుట. బెండకాయలు పచ్చగానే కాదు, ఎరుపురంగులోనూ ఉంటాయి. వీటిలోని పీచు మనకెంతో మేలు చేస్తుంది. జీర్ణమైన ఆహారంలోని చక్కెర రక్తంలో కలిసే వేగాన్ని తగ్గిస్తుంది. నీటిని పీల్చుకోవడం ద్వారా మలబద్ధకాన్ని తొలగిస్తుంది. కడుపులో పుళ్లను తగ్గించడమే కాదు, పేగుల మీద పొరలా పరుచుకుని వాటిని కాపాడుతుంది.

-కాలిపు శంకరరావు

